క్లుప్తంగా

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


నినాదాలు చేస్తున్న నాయకులు

పర్చూరు (చినగంజాం): పర్చూరులో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బొమ్మల సెంటర్‌లోని పార్టీ జెండాను బీజేపీ జిల్లా నాయకులు అడపాల కృష్ణ ఆవిష్కరించారు. పర్చూరు నియోజక వర్గంలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. దాసి అనందరావు, దుడ్డు స ంతోష్, దేవతోటి శ్రీకృష్ణ, మురికిపూడి ఏసోబు, రూబేలురుషి తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్లలో శాంతియుత ర్యాలీ


మేదరమెట్లలో ఎస్ఐకు వినతి పత్రాన్ని అందిస్తున్న పాస్టర్లు

మేదరమెట్ల: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో పాస్టర్ల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఆయన మరణం వెనుక ఉన్న నిజాలను బయటకు తీసుకురావాలని కుటుంబ సభ్యులకు సానుభూతి చేకూరాలని కోరారు. అనంతరం మేదరమెట్ల ఎస్ఐ మహ్మద్ రఫీకి వినతి పత్రాన్ని అందచేశారు. ఆశీర్వాదం, దానియేలు, ఏసుబాబు, జాన్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): ప్రవీణ్ పగడాల మృతిని అనుమానాస్పద హత్యగా చిత్రీకరించడాన్ని నిరసిస్తూ ఆదివారం ఇంకొల్లు మండలం పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ పగడాల హత్యపై సమగ్ర విచారణ జరిపించి హత్యపై అనుమానాల్ని నివృత్తి చేయాలని నినదించారు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఇందుకు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకొల్లు మండల పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో సుమారు 60 మంది పాస్టర్లు, 160 మందికి పైగా క్రైస్తవులు పాల్గొన్నారు. ఇంకొల్లు గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీని శాంతియుతంగా నిర్వహించారు.


ఇంకొల్లులో ర్యాలీ..

చలివేంద్రాలు ప్రారంభం

సంతనూతలపాడు: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు ఆదివారం ప్రారంభించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో శిఖాకొల్లి కోటంశెట్టి, వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్ధం వారి కుమారుడు, బెంగుళూరుకు చెందిన ఇంజినీర్ శిఖాకొల్లి సత్యనారాయణ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ అధ్యక్షుడు వేమా మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శిఖాకొల్లి సత్యనారాయణ, సెక్రటరీ పబ్బిశెట్టి ఆంజనేయులు, కోశాధికారి వేమా చిన వెంకట కృష్ణారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా సీతారామ కళ్యాణం


పంగులూరులో కనుల పండువగా స్వామివారి కళ్యాణం


పూనూరు రాములవారి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


కొత్తపాలెంలో అలంకరణలో సీతారామలక్ష్మణులు


చీరాల: విశేష అలంకరణలో పూజలందుకుంటున్న సీతారామ లక్ష్మణులు


మేదరమెట్ల తూర్పుపాలెం సీతారామస్వామి దేవస్థానంలో కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


ఉప్పటూరులో సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు

● వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు

వేటపాలెం: వివిధ గ్రామాల్లోని రామాలయాల ప్రాంగణాల్లో శ్రీరామనవమి పండగ పురస్కరించుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో రాములోరి పెళ్లి సందడి ఆదివారం నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో రామమందిరం వద్ద, స్థానిక మహాలక్ష్మమ్మ చెట్టు వద్దగల అమ్మవారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. అనంతరం వడపప్పు పానకం పంచిపెట్టారు. శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించారు. ఆణుమల్లిపేటలో గల మహాలక్ష్మమ్మ మందిరం వద్ద, పందిళ్లపల్లి, దేశాయిపేట, బొచ్చులవారిపాలెం, కఠారివారిపాలెం, కొత్తరెడ్డిపాలెం, రామానగర్, సర్వోదయ కాలనీలో గల రామమందిరం వద్ద సీతారామ కళ్యాణ మహోత్సవం వైభంగా నిర్వహించారు.

యద్దనపూడి: శ్రీరాముడు, జానకిల వివాహ మహోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. శ్రీరామనవమి పండుగ వేడుకల్లో భాగంగా యద్దనపూడి మండలంలో అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అనంతవరం, పూనూరు, గన్నవర, జాగర్లమూడి, పోలూరు, చింతపల్లిపాడు, యద్దనపూడి తదితర గ్రామాల్లోని వీధుల్లో చలవ పందిళ్లను ఏర్పాటు చేసి సీతారాముల ప్రతిమలను ఉంచి స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతన దంపతులు పీటలమీద కూర్చొని కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాలను నిర్వహించారు.

అద్దంకి: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రజలు ఉదయాన్నే లేచి తలంటు స్నానాలు చేసి స్వామివారిని భక్తితో పూజించారు. అదే విధంగా గ్రామాల్లో పందిళ్ల వేసి రామా లయాల్లో, సీతారాముల కళ్యాణం నిర్వహించారు. తిమ్మాయపాలెంలోని సీతారామ స్వామి దేవస్థానంలో పుట్టంరాజు వారి వంశస్తులు కళ్యాణం జరపించి వడపప్పు పానకం భక్తులకు పంపిణీ చేశారు. మండలంలోని ప్రముఖ క్షేత్రమైన శింగరకొండలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై సీతారముల కళ్యాణాన్ని ఆలయ ఏసీ తిమ్మనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అద్దంకిలో గతంలో సీఐగా పనిచేసిన ఘట్టమనేని శ్రీనివాసరావు దంపతులు కళ్యాణం నిర్వహించారు.

అద్దంకి రూరల్: అద్దంకి కార్పెంటర్స్ ఉడ్ కాంపెక్స్ వద్ద పానకం, వడపప్పు ప్రసాదాలను భక్తులకు అందజేశారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో నూతన కార్యాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

మార్టూరు: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాల్లో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు, మార్టూరు, రాజుపాలెం, కోలలపూడి రామాలయాల్లో సీతారాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ద్రోణాదుల గ్రామంలోని సాయి మందిరంలో 108 జంటల సమక్షంలో సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. స్థానిక గన్నవరం సెంటర్‌లోని వ్యాపారులు ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాగరాజుపల్లి సెంటర్‌లోని మహాలక్ష్మి అమ్మవారి చెట్టు దగ్గర శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


ఆదిపూడిలో భక్తుల కోసం ప్రదర్శించిన 1818 నాటి శ్రీరాముని పట్టాభిషేకంతో కూడిన నాణెం

జె.పంగులూరు: రామమందిరాల్లో ఆదివారం సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని రామమందిరంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. కళ్యాణాన్ని భక్తులు వీక్షించేందుకు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. పంగులూరు భీమ లింగేశ్వర దేవాలయం ప్రాంగణంలో స్వామి వారి కళ్యాణ భక్తులు నిర్వహించారు.

చీరాల టౌన్: పట్టణం, రూరల్ గ్రామాల్లో వాడవాడలా శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చలువ పందిళ్ళను ఏర్పాటు చేశారు. మండలంలోని ఈపూరుపాలెంలో గల పద్మనాభునిపేటలో శ్రీనివాస భక్త బృందంచే శ్రీసీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. పట్టణంలోని వీరరాఘవపేట, బెస్తపాలెం, కొట్లబజారు. పట్టాభి స్వీట్స్ సమీపంలో, రామమందిరం వద్ద నిర్వహించారు. ముందుగా సీతారాముల చిత్రపటాలను మేళతాళాలతో ఊరేగించారు. మండలంలోని పలుగ్రామాలు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణమహోత్సవాల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య, భార్య బాలకొండమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి.. అన్నదానంలో పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలో శ్రీరామ నవమి పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. చినగంజాం మండలం తీరప్రాంత గ్రామాలతో పాటు మండలంలోని 12 పంచాయతీల పరిధిలో ఉన్న రామాలయాల్లో శ్రీరామ నవమి పండగ నిర్వహించారు. ముఖ్యంగా మత్స్యకార గ్రామాలైన మోటుపల్లి, పల్లెపాలెం, పెదగంజాం, పల్లెపాలెం, కోడూరివారిపాలెం, కాటం వారి పాలెం గ్రామాల్లోని రామాలయాలలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. చినగంజాంలో అతి పురాతన దేవాలయంగా ప్రసిద్ధి చెందిన సీతారామ స్వామి ఆలయం ప్రాంగణంలో అత్యంత వైభవంగా సీతారామస్వామి కళ్యాణంను నిర్వహించారు. సోపిరాల రామాలయం, రేల్వే స్టేషన్ సెంటర్, మూలగాని వారిపాలెం రామాలయం సెంటర్‌లలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పర్చూరు(చినగంజాం): నూతలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న పురాతన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు కార్యక్రమానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిపూడి గ్రామానికి చెందిన కాల్వరఘురామయ్య శ్రీరాముడి పట్టాభిషేకానికి సంబంధించి 1818లో ముద్రించిన రాగి నాణాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

కారంచేడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం కార్యక్రమాలను అత్యంత వైభవంగ నిర్వహించారు. కారంచేడు పంచాయతీ కార్యాలయం వద్ద కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చక స్వాములు కేశవాచార్యులు, రమణాచార్యులు తీర్థప్రసాదాలను అందించారు. గ్రామానికి చెందిన కొంత మంది దంపతులు కల్యాణంను నిర్వహించారు. ఉప్పరపాలెంలో ఎన్నో సంవత్సరాలుగా ఆచారంగా వస్తున్న గుర్రాలతో ఆటలు అలరించాయి. మండలంలోని స్వర్ణలో నడిగడ్డలో ఏర్పాటు చేసిన పందిరిలో నీరుకట్టు శరత్‌బాబు దంపతులు కల్యాణంను జరిపించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వెంకటప్పయ్య-అంజమ్మ దంపతులు కల్యాణం చేశారు. మండలంలోని కుంకలమర్రు, ఆదిపూడి, యర్రంవారిపాలెం, తిమిడెదపాడు, దగ్గుబాడు, పోతినవారిపాలెం, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల్లో కల్యాణంను జరిపించారు.

పర్చూరు(చినగంజాం): మండల పరిధిలోని ఉప్పుటూరులో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోనేరు వీరాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకలకు వేలాది మంది భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రముఖ పురోహితులు కారంచేటి పిచ్చయ్యశాస్త్రి ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు.

మేదరమెట్ల: శ్రీరామనవమి పర్వదినాన్ని కొరిశపాడు మండలంలోని ప్రజానీకం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మేదరమెట్ల తూర్పుపాలెంలోని సీతారామస్వామి దేవాలయం ప్రాంగణంలో ఐదు రోజులుగా శ్రీరామనవమి వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. రాత్రి కోలాటం కార్యక్రమం జరిగింది.

బల్లికురవ: సత్యం, ధర్మం, కరుణ పాటించిన శ్రీరాముని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని అర్చకులు అన్నారు. కొత్తపాలెం, కొణిదెన, గంగపాలెం, చెన్నుపల్లి, అంబడిపూడి, మల్లాయపాలెం, కొండాయపాలెం, కొమ్మినేనివారిపాలెం, గ్రామాల్లో జైశ్రీరామ్ అంటూ అభిజిత్ లఘ్నంలో కల్యాణతంతు ముగించారు. కొత్తపాలెం రామాలయం వద్ద చల్లగుండ్ల వంశస్తులు 9 జంటలు కళ్యాణంలో పాల్గొన్నాయి.

సంతమాగులూరు(అద్దంకి రూరల్): శ్రీరామనవమి సందర్భంగా సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో ఆదివారం రామాలయంలో సీతారాముల కల్యాలయం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఘనంగా గ్రామోత్సం నిర్వహించారు. కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.


వేటపాలెం లైబ్రరీ వద్దగల మహాలక్ష్మమ్మ మందిరం వద్ద..


వేటపాలెం రామమందిరం వద్ద సీతారామ కళ్యాణం


కోలలపూడి గ్రామంలోని రామాలయంలో సీతారాముల కళ్యాణ దృశ్యం


అద్దంకి: కళ్యాణంలో పాల్గొన్న ఘట్టమనేని శ్రీనివాసరావు దంపతులు


కారంచేడులో కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు


స్వర్ణలో కళ్యాణం జరిపిస్తున్న దంపతులు


శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్న కార్పెంటర్లు


నూతలపాడులో సీతారామ కళ్యాణం నిర్వహిస్తున్న భక్తులు


చీరాల: కళ్యాణ మహోత్సవం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య దంపతులు


చినగంజాంలో సీతారామ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


చెన్నుపల్లిలో ఎదుర్కోల నిర్వహిస్తున్న అర్చకుడు


సీతారాముల గ్రామోత్సవం


పంగులూరు పురవీధుల్లో స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

సాగర తీరం.. ఆనందాల హోరు


వాడరేవు సముద్రంలో స్నానం చేస్తున్న దృశ్యం

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్రతీర ప్రాంతం పర్యాటకులు, భక్తులతో కిటకిటలాడింది. ఎండలు విపరీతంగా కాస్తుండటం, వరుసగా సెలవులు కావడంతో సముద్ర తీరం ఒడ్డున సేదతీరేందుకు పర్యాటకులు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన ప్రజలతో పాటు గుంటూరు, విజయవాడ తదితర పట్టణాలకు చెందిన వారు సైతం కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అయితే అధికారులు తీరం ఒడ్డున కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారు. సముద్రంలో స్నానం ఆచరించిన మహిళలు బట్టలు మార్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన


చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

చినగంజాం: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మండల కేంద్రమైన చినగంజాంలో ఆదివారం ముస్లింలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. చినగంజాంలోని మసీదు పేట, ఇస్లాం పేటకు చెందిన ముస్లింలు తమకు న్యాయం కావలంటూ చేతిలో ప్లకార్డులు ధరించి చినగంజాం గ్రామంలోని వీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ముస్లిం హక్కులను కాపాడాలంటూ ప్రభుత్వం అందుకు తమకు న్యాయం చేయాలంటూ వారు నినాదాలు చేశారు. మర్కస్ మసీద్ ప్రెసిడెంట్ షేక్ నభీషా వక్ఫ్ సవరణ బిల్లునుద్దేశించి మాట్లాడారు. శాంతియుతంగా నిర్వహించిన నిరసన ర్యాలీ కార్యక్రమంలో ఎంఐఎం మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ సుభాని ఖాన్, షేక్ జియావుద్దీన్,మహ్మద్ హబీబుల్లా, షేక్ జిలాని పాల్గొన్నారు.

విజయాన్ని అందించు గంగమ్మ తల్లీ !


కారంచేడులో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న విద్యార్థులు

కారంచేడు: రాసిన పరీక్షల్లో మంచి విజయాన్ని సొంతం చేసుకొనేలా దీవించాలంటూ విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పది, ఇంటర్, ఎంసెట్ కోచింగ్ విద్యార్థులు ఆదివారం గంగమ్మతల్లికి మొక్కుకున్నారు. అర్చకులు ఆవుల రాజేష్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం పుష్యమి నక్షత్రం దశమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు